# తప్పటడుగు

చెన్ను సుశీలా రామం




"ఆంటీ. ఆంటీ..." పిలుస్తూ లోపి కొచ్చింది రాధిక.

"ఎవరూ. రాధీ... రావమ్మా రా. సమయాని కొచ్చావు. ఇప్పుడే మిరపకాయలు బజ్జీలు చేశాను. నీ కిష్టం కదా. వచ్చి పిలుద్దామనుకుంటున్నాను. ఇంతలోకి నువ్వే వచ్చావు." బజ్జీలు ప్లేటులో సర్ది తీసుకొచ్చింది విమల. ఇద్దరూ హాల్లో కూర్చున్నారు.

"ఆంటీ. నువ్వుబజ్జీలుచెయ్యడంలో స్పెషలిస్టువి. ఇలా చెయ్యడంమా అమ్మ కస్సలు చాతకాదు." ప్లేటు ఖాళీ చేసి మంచి నీళ్ళు తాగి స్థిమితంగా కూర్చుంది రాధిక. "ఆంటీ. అంకుల్ అప్పుడే రారు కదా. ఈ రోజు నీతో ఒక ముఖ్యమైన విషయం చెబుదామనుకుంటున్నాను. ఇక్కడైతే ఎవరైనా వస్తారు. అలా డాబా మీది కెళదామా."

"ఏవిటే... ఈ రోజు కొత్తగా మాట్లాడుతున్నావు. ఏవిటంత ముఖ్యమైన విషయం? సరే పద. వీధి తలుపేసి వస్తాను. అలా డాబా మీదికే పోయి కూర్చుందాము." ఇద్దరూ డాబా మీది కెళ్ళి కూర్చున్నారు.

"ఆఁ. ఇప్పుడు చెప్పు తల్లీ విషయ మేమిటో. సస్పెన్సులో పెట్టేశావు నన్ను."

పెద్దవాళ్ళెప్పుడూ భయస్తులు, చాదస్తులు.''

''లేదమ్మా! నాది చాదస్తం కాదు. పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళు సుఖాంతం, పిల్లలు ప్రేమించి చేసుకున్నవి దుఃఖాంతం అవుతాయని ఎప్పటికీ అనను. కాని, నా అనుభవం మీద చెబుతున్నాను. ఎక్కడో ఎవరి గురించో చెప్పడం లేదు. నా గురించే చెబుతాను. ఆడపిల్ల వయసులో ఉండగా ఒక్కసారి తప్పటడుగు వేస్తే సరిదిద్దుకోవటం ఎంత కష్టమో నీవే తెలుసుకుంటావు. అప్పుడు సరిగా నేనూ నీ వయసులో ఉన్నాను. కాని, నీలా చదువుకోవటం లేదు. ఏవేవో కామ్పుల వల్ల రోగగ్రస్తురాలై మంచాన పడి ఉన్న మా అమ్మకు చాకిరీ చేస్తూ, ఇల్లు వాకిలి పట్టకుండా తిరిగే తండ్రి చీదరింపులు, చెప్పు దెబ్బలతో ఏ సరదాలు, సంతోషాలు లేని నాపైన నాగరాజు మాటలు మత్తుమందు జల్లాయి. అరచేతిలో స్వర్గం చూపిస్తున్న అతని మాటలు, చేతలకు నేను పూర్తిగా లోబడిపోయి, సినిమాల్లో చేరి పెద్ద నటినై పోవాలన్న తపనతో ... మేకపిల్ల కసాయివాణ్ణి నమ్మి కూడా వెళ్ళినట్లు నేను వాడి కూడా వెళ్ళిపోయాను. కత్తి ఎత్తి తనను చంపబోయినప్పుడుగాని, మేకపిల్ల ఆ కసాయివాడి నిజరూపం తెలుసుకోలేనట్లు ... ఆ నాగరాజు ఎలాంటివాడో ... నన్ను వూరు వదలి, వాడి పరిధిలోకి వెళ్ళాక గాని తెలుసుకోలేక పోయాను. నా జీవితం నరకప్రాయం చేసుకున్నాను. ఆ సుడిగుండాల వూబి నుండి, నా బ్రతుకు కుక్కలు చింపిన విస్తరి కాకుండా, నాకు మాయని మచ్చ పడకుండా దైవంలాగా మీ అంకుల్ నాకు చేయూత నిచ్చి నా బ్రతుక్కో ఆధారం చూపించారు. కాని ... మీ అంకుల్ దగ్గరకొచ్చాక కూడా ఆ పశువు నన్ను ఎలా వెంబడించిందీ ... ఎలా భయపెట్టి వేధించిందీ నేను ఈ జన్మలో మర్చిపోలేను రాధీ ... నా మనసులో ఏ కల్మషం లేదు గనుక... నా గతం నీ ముందుంచడానికి నేను సంకోచించను. సిగ్గుపడను.

ఆ రోజు... ''అమ్మగారూ, తమరికోసం ఎవురో వొచ్చినారండీ ...'' పని మనిషి వచ్చి పిలవడంతో చేస్తున్న పని ఆపి డ్రాయింగురూములో కెళ్ళాను. సిగరెట్టు పొగ రింగులు రింగులుగా వదులుతూ కాళ్ళు రెండూ టీపాయ్ మీదికి బార్లాజాపి విలాసంగా వూపుతూ అటు తిరిగి కూర్చున్న ఆగంతుకునిమీద విపరీతమైన కోపం ముంచు కొచ్చింది నాకు. సిగరెట్టు పొగన్నా, అవి కాల్చేవాళ్ళన్నా పరమ చిరాకు నాకు. మేనర్సు లేకుండా కొత్తచోట అలా ప్రవర్తిస్తున్న అతన్ని గట్టిగా మందలించాలని నా ఉనికిని తెలియజేస్తూ పొడిగా దగ్గాను.

అటు తిరిగి కూర్చున్న తను కాళ్ళు కిందికి పెట్టి మెల్లగా ఇటు తిరిగాడు. తే... దయ్యాన్ని చూసి జడుసుకున్నట్లుగా కెవ్వు మనబోయి, ఆ కేక గొంతు దాటి బైటికి రాక . గొంతు నొక్కేస్తున్నట్లు వెర్రిచూపులు చూసాను.

'' బ్యూటిఫుల్ గాల్ ... వయసు పెరిగి అందం తరుగుతుంది ఎవరికైనా ... కాని, మీ అమ్మ నిన్ను పాలకు బదులు అమృతం పోసి పెంచినట్లుంది. ఇద్దరు పిల్లలని విన్నాను. ఇంకా పెళ్ళికాని దానిలా పిటపిటలాడిపోతున్నావ్. మొగుడు పెద్ద ఆఫీసరు, ఉండటానికి అందమైన బంగళా. నౌకర్లు చాకర్లు. సంఘంలో మంచి పలుకుబడి ...వూ ... పెద్దకుండకే ఎసరు పెట్టే గొప్పోడినే పట్టావు. కాని, ఈ భూ ప్రపంచంలో ఎక్కడున్నా నన్ను తప్పించుకోలేవు. మన పురాణాల్లో ద్రవుపదికి ఐదుగురు మొగుళ్ళని చదివాం. ఆవిడ్ని అనుసరించాలని చూస్తున్నావు గాబోలు ... మిగిలిన ముగ్గురూ రెడీగా ఉన్నారా, లేదా? ఎంతకైనా తెగించిన దానివే నువ్వు. నీ అంతేవిటో ఇప్పుడే తేల్చేస్తాను. ఇక్కడున్న వాడికి పుట్టేన గుంట లిద్దర్నీ వీడి దగ్గరే వదిలేసి నాకూడా వచ్చెయ్యడానికి సిద్ధంగా ఉండు. పనిమీద వెళ్తున్నాను. తిరిగి నాల్గు రోజుల్లో వస్తాను. పిచ్చి పిచ్చి వేషాలేమైనా వేశావా జాగ్రత్త. తాట ఒలిచి చేతిలో పెట్టేస్తాను. బీ కేర్ ఫుల్ ...'

ఒక్క ఉదుటున పైకి లేచి, అడ్డంగా ఉన కుర్చీని ఒక తన్ను తన్ని విసురుగా వెళ్ళిపోయాడు నాగరాజు.

జరిగిందది కలో నిజమో తేల్చుకోలేని అయోమయావస్థలో పడిపోయాను నేను. లోపలినుండి బాబు ఏడుపు వినబడగానే ఒక్క ఉదుటున లోనికెళ్ళి బాబు పక్కలో పడుకుని, వాడ్ని జోకొట్టసాగాను.


# అపూర్వరుచి! - తియ్యదనం!

# స్వస్తిక్స్

స్వస్తిక్స్‌వారి అతిరుచికరమైన గులాబ్‌జామున్ మిక్స్

ఉచితం
ఒక్కొక్క 200 గ్రాం. ప్యాకెట్‌తో
స్త్రీలకు చేతిగుడ్డ ఒకటి ఇనామ్
ఒక్కొక్క 100 గ్రాం. ప్యాకెట్‌కు
ఒక నోటు పుస్తకము ఇనామ్

స్వస్తిక్ బంగారువన్నె
గులాబ్‌జామున్ రుచి
అనితరము, అపూర్వము,
మనోహరము
మామూలు భోజనాన్నయినా
విందుగా మార్చగల
వంటకం




స్వస్తిక్ కెమికల్
ఇండస్ట్రీస్
స్వస్తిక్ హవుస్
23/1, జైన్ టెంపుల్ స్ట్రీట్,
వి.వి. పురం,
బెంగుళూరు-560 004


వాడు ఏడుపు మాని నన్ను గట్టిగా కౌగలించుకుని నిద్రపోయాడు. ఎందుకో నాకే తెలియని విపరీతమైన దుఃఖం తెరలు తెరలుగా ఎచ్చేస్తోంది. నాగరాజు పగబట్టిన నాగులా నన్ను వెంబడిస్తూనే ఉన్నాడు. వాడ్ని చూస్తే ... నా గత చరిత్ర తెలుసుకుంటే ... నా భర్త చక్రవర్తి నను చీదరించుకుని, బైటికి గెంటేయటం ఖాయం. నా లాంటి ఆడదాన్ని ఏ మగాడూ ఉపేక్షించడు. ఏ ఆడదీ చెయ్యని పని సాహసించి చేశాను నేను. ఏ దారీ గానక ప్రాణం తీసుకో బోతున్న నన్ను కాపాడి, సహృదయంతో తన జీవిత భాగస్వామిగా చేసుకున్నారు చక్రవర్తి. ఏ నాడూ నా గత జీవితం ఇలాంటిదని నేను చెప్ప ప్రయత్నించలేదు. ఆయనా అడగలేదు. అంత వరకు నన్ను ప్రాణంగా చూసుకున్నా రాయన.

మానవత్వం రూపుదాల్చిన భర్త, రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలు ... వడ్డించిన విస్తరిలా ఏ చీకూ చింతా లేకుండా సాగిపోతున్న నా సంసారంలో, నా నోట మట్టికొట్టడానికి గుప్పెడు మట్టి పట్టుకుని ఆ దైవం పొంచి ఉన్నా డనుకున్నాను. పంచభక్ష్య పరమాన్నాలు రుచి చూస్తున్న నేను మట్టి తిన గలనా? స్వర్గమంటే ఎలా ఉంటుందో తెలియ నపుడు నరక కూపంలో మగ్గిపోతున్న నన్ను దైవం లాంటి భర్త లభించి జీవితం స్వర్గతుల్యంగా మార్చి నపుడు, తిరిగి ఆ నరకాని కెళ్ళి బతక మంటే ఎవరి కైనా సాధ్యమవుతుందా?

భగవంతుడా ఏమిటి దారి ... అసలు విషయం ఆయనకు తెలిస్తే నన్ను తన దగ్గ రుండనివ్వరు. ఆ నాడే నేను చచ్చిపోయుంటే ఈ బాధ ఉండక పోను. ఇప్పు డీ బంధాలు అనుబంధాలు ఎందుకు కల్పించాలి? భర్త, ఇద్దరు బిడ్డలు, వీళ్ళ ముగ్గురిలో ఏ ఒక్కర్నీ విడిచి ఒక్క క్షణమైనా బ్రతకలేనని తెలుసు. ఇప్పుడేం చెయ్యాలి? ఏమిటి దారి ... తలలో రోకళ్ళు పెట్టి మోదుతున్నంత బాధగా ఉంది. కన్నీళ్ళకు తలగడా తడిసిపోయింది.

వీధిలో స్కూటరు శబ్దమైంది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. గబగబా కళ్ళు తుడిచేసుకుని సాధ్యమైనంత నవ్వు ముఖంలోకి తెచ్చుకున్నాను. "ఏయ్ విమలా ... ఎక్కడున్నావోయ్ ... విమలా ... హోయ్ విమలా ..." బడినుండి రాగానే తల్లికొంగు పట్టుకొని తిరిగే పసి కుర్రాడిలా ఇంటికి రాగానే నేను కనిపించకపోతే హడావుడి పడిపోతూ, గదులన్నీ వెదుక్కుంటూ తిరిగేస్తా రాయన. ఆ పిలుపుకు నా చెవుల్లో అమృతం పోసినట్లుండేది ఎప్పుడూను. కాని, అప్పుడు మాత్రం ఉరికంబ మెక్కబోతున్న నేరస్థురాలిలా నా గుండె దడదడలాడిపోతూంది.

"హాయ్ విమ్మీ ... ఇక్కడున్నావా? రోజంతా దగ్గరే ఉంటున్నా, కుమార రత్నం మీద ప్రేమ తరగడం లేదా? ఇందాకట్నుండీ గొంతు చించు కుంటున్నా పలకవేం? అందుకే అన్నారు ... ఆడదానికి మొగుడి మీద ప్రేమ పిల్లలు పుట్టేంతవరకేనని. అదేమిటి అలాగున్నావ్? ఒంట్లో బాగుండలేదా? కళ్ళు అలా ఎర్రబడి ఉబ్బిపోయా యేమిటి? ఏమైంది డియర్...జ్వరం తగిలిందా?' కంగారుగా నుదురు, మెడ, చేతులు తాకి చూస్తున్న ఆయన గుండెల్లో తల




దాచుకుని తనివితీరా ఏడవా లనిపించింది. కాని అతి కష్టంమీద నన్ను నేను అదుపులో ఉంచుకున్నాను.

ఒక్కో రోజు గడుస్తూంటే ఆయువు మూడి చావు దగ్గర కొస్తున్నట్లుగా ఉంది. నాలో కొట్టొచ్చి నట్లు కనిపిస్తున్న మార్పును గమనించారు చక్రవర్తి. ఎన్ని విధాల తరచి తరచి అడిగినా, నా నుండి ఎటువంటి సమాధానం రాకపోవడంతో వూరు కున్నారు. ఏం జరిగితే అదే జరుగుతుందిలే అన్న మొండి ధైర్యం నాలో ప్రవేశించింది.

చెప్పిన రోజుకల్లా వచ్చాడు నాగరాజు. ఆయన ఇంట్లో లేకుండా చూసి వచ్చాడు. "ఏం రెడీగా ఉన్నావా? ఇంక బైల్దేరదామా ..." సోఫాలో కూర్చుంటూనే అడిగాడు. అతనికి కొంచెందూరంలో కూర్చున్నాను నేను. 'ఎక్కడికి బైల్దేరడం' ఎదురు ప్రశ్నించాను.

'వాట్ నాన్‌సెన్స్ యు ఆర్ టాకింగ్ ... ఎక్కడి కేమిటి? నా ఇంటికి ... నాతో బైల్దేరు తున్నావు నువ్వు ...'. 'నేను రాను' నెమ్మదిగానే ఐనా గట్టిగా, స్థిరంగా చెప్పాను. అదో జోక్‌లా పకపకా నవ్వాడు. కాస్సేపటికి నవ్వడం ఆపి సీరి యస్‌గా అన్నాడు ...

"నువ్విలాంటి సమాధాన మిస్తావని నాకు తెలుసు. నిన్నిప్పుడు కొట్టి, తిట్టి బలవంతంగా నాకూడా తీసుకెళ్ళను. కాని, నీ మొగుడు ఇంటి కొచ్చేవరకు ఆగి ఇంతకు ముందే నీ కింకో మొగుడున్నాడని, వాడు బ్రతికుండగానే ఇతని కళ్ళుగప్పి, ఇతన్ని పెళ్ళాడావని పది మందినీ పిలిచి సాక్ష్యాధారాలన్నీ చూపించి మరీ చెబుతాను. అంతే ... ఫినిష్—ఇంతటితో ఇక్కడి నీ బ్రతుకు క్లోజ్ అవుతుంది. మూతిమీద మీసం ఉన్న ఏ మగవాడూ నీ లాంటి దాన్ని ఏలుకోడు. మెడ పట్టి వీధిలోకి గెంటుతాడు. బాధ్యత గలిగిన వో ఉద్యోగస్థుడు చక్రవర్తి. అందరికీ తెలిసి అతని పరువు బజార్న పడి అతన్ని తలెత్తుకుని తిరక్కుండా చేశాకే వస్తానంటే నాకేం అభ్యంతరం లేదు.' తాపీగా సిగరెట్టు వెలిగించు కున్నా డతను.

నా ప్రాణాలు తియ్యడానికి యముడే ఆ రూపంలో వచ్చాడనిపించింది. గుండె దడదడ కొట్టుకోటం నా చెవులకు వినిపిస్తూనే ఉంది. కాని, అధైర్య పడటాని కది సమయం కాదని తెలుసుకుని నన్ను నేను ఓదార్చు కుని, ధైర్యం చెప్పుకున్నాను.

'నాగరాజూ! నీ కాళ్ళు పట్టుకుంటాను. నన్నొది లెయ్. నా భర్త, నా ఇద్దరు బిడ్డలు నా ప్రాణం. వాళ్ళని విడిచి బ్రతకలేను నేను. నీ కెంత డబ్బు కావాలో చెప్పు ఇస్తాను. మరెప్పుడూ నా ఛాయలకు రాకు. చెప్పు—ఎంతకావాలి నీకు...' వాడ్ని ప్రాధేయ పడ్డాను.

'ఛత్ ... డబ్బిస్తావా నాకు? ఎంతిస్తావు? అస లెంత ఇవ్వగలవు? మహా ఇస్తే ముష్టి పదివే లిచ్చేవు ... ఇరవై ఇచ్చేవు. కాని నీ మూలంగా నా కెంత నష్టం సంభవించిందో నీకేం తెలుసు? నా దగ్గరున్నపుడే నిన్ను చూసిన సేఠ్ నిన్ను తన కప్ప జెప్పితే లక్షిస్తా నన్నాడు. ఆ మస్తాన్‌గాడు—తన బిజినెస్‌లో షేరిస్తానన్నాడు. మరి ఆ డేవిడ్ లక్షల విలువ చేసే తన హోటల్ రాసిస్తానన్నాడు. నీ వల్ల ఇంత రాబడి ఉండగా ఏ చచ్చు వెధవా నిన్ను వదులు కోడు. అసలు నువ్వంటే నా కెంతో క్రేజు. దాని మూలంగానే మిగిలిన ఆడపిల్లల్లా నిన్ను సాని కొంప లకు అమ్మలేక పోయాను. విదేశాలకు ఆడపిల్లల్ని సప్లై చేసే ముఠాకు ఎందర్నో అప్పజెప్పాను గాని— నిన్ను పంపలేకపోయాను. ఇక్కడే ఎవడో ఒకడి దగ్గరయితే నువ్వు బాగుంటావని,నిన్ను అప్పుడప్పుడు నేను చూస్తుండ వచ్చునని ఆలోచించి బేరం పెడుతుండగా, ఇలా నా కన్నుగప్పి వచ్చేశావు. ఈ నాలుగేళ్ళ నుండీ నిన్ను వెదకడానికి నా కెంత ఖర్చు అయిందో ఇంత కింతా నీ నుండి గుంజి తీరుతాను. మొన్న నీ మొగుడూ నువ్వూ స్కూటరు మీద వెళ్తుండగా చూసి నీ అడ్రసు కనుక్కో గలిగాను గాని ... ఇంకా నీ గురించి ఎంతకాలం తిరగాల్సి వచ్చేదో ...

నీ మెడలో తాళి కట్టింది అక్కడున్న పుండా కోర్లకు జడిసి ... వాళ్ళు నీ దగ్గరకు చేరకుండా ఉంటారనీ ... కాని ఏం లాభం? తాళికట్టి బైటి వాళ్ళకు నీ మొగుడిగా చెలామణి అవ్వగలిగానుగాని రెండు నెల్లు దాటినా, నాతో చావుదెబ్బలైనా తిన్నావు గాని నన్నుమాత్రం దగ్గరకు చేరనివ్వలేదు. కటిక దరిద్రం అనుభవిస్తున్న దాన్ని తీసుకొచ్చి పెళ్ళాడి అన్ని సుఖాలు అందజేస్తుంటే ఆ మాత్రం విశ్వాస మైనా లేకుండా, నీ దగ్గర కొచ్చినప్పుడల్లా కుక్కను తరిమినట్లు తరిమేసేదానివి ... సరే, జరిగి పోయింది అనవసరం. అక్కడ నిన్ను బేరంపెట్టి

వచ్చాను. ఎవడి ద్వారా ఎక్కువ ముడుతుందో వాడికే అప్పజెప్పతాను నిన్ను. ఆ రోజు రేపటికి ఫిక్స్ చేసి వచ్చాను. మర్యాదగా వెంటనే నాతో బయల్దేరినా సరే ... లేకుంటే ఇదిగో—మన పెళ్ళినాటి ఫోటోలు ... చక్రవర్తికే గాకుండా ఈ వీధి మొత్తం అందరికీ పంచిపెడతా నివి ...'

శిలా ప్రతిమనై పోయాను నేను. మెదడు మొద్దుబారిపోయింది. నోరు మెదిపి ఒక్క మాటా మాట్లాడలేక పోతున్నాను. ఇంతలో చక్రవర్తి వచ్చారు లోనికి. అతన్ని చూసి హతాశురాలినై పోయాము. 'ఏమిటి విమలా అలా చూస్తున్నావ్? స్కూటరు శబ్ద మవ్వకుండా ఎలా వచ్చానా అని చూస్తున్నావా? స్కూటరు పాడైతే దారిలో మెకానిక్‌కి అప్పజెప్పి రిక్షాలో వచ్చాను. సాయంత్రం కేంప్ వెళ్ళాలి. అన్నీ సర్దుకోవాలి కదా అందుకే టూ అవర్స్ ముందు వచ్చేశాను. ఆఁ ... సారీ ... ఎవరండీ మీరు? నా గొడవలో పడి మీ రెవరో గమనించనే లేదు. మా విమల చుట్టాలా, స్నేహితులా? మీ పేరేమిటి? ఏ వూరు, ఏం చేస్తున్నారు?' కూర్చుంటూ ఒకదాని వెనకాల ఒకటి ప్రశ్నల వర్షం కురిపించా రాయన.

అప్పటికే నా ముఖమంతా రక్తం తోడేసినట్లు తెల్లగా పాలిపోయింది. పొయ్యి మీద పెనంలా, పొయ్యి మధ్య పులుసు గంగాళానికి బదులు నన్ను కూర్చుండ బెట్టినట్లుగా ఉంది నా పరిస్థితి.

ఇంక చెప్పడం నాకు తప్పదు. దాచడం భావ్యమూ కాదు. నా పేరు నాగరాజు. మీ ఆవిడ మొదటి మొగుణ్ణి. ఒకసారి పెళ్ళయ్యి మొగుడు బ్రతికుండీ మీ కన్ను గప్పి, మీకు ఎసరు పెట్టింది. ఇలా చెయ్యడం చట్ట రీత్యా నేరమని మీకు బాగా తెలిసే ఉంటుంది. ఇప్పుడు ఈమెను నా కూడా తీసుకెళ్ళటాని కొచ్చాను. మీరు ఎలాంటి గొడవా లేకుండా ఈమెను వదుల్చుకుంటారని, నాకు అప్పగిస్తారని తెలుసు నాకు. ఈ గొడవల్లో మన మధ్య మూడో మనిషి రావడం మీ పరువు ప్రతిష్ఠలకు భంగ మవుతుంది. అందులోను ఈవిడగారి గుణగణాలు మీకు తెలియదు. నేను చెప్పడం మొదలు పెడితే ... ఈ రోజంతా వర్ణించినా సరిపోదు.'

'రియల్లీ ... ఆమె గుణగణాలు ఈ రోజంతా వర్ణించినా టైము సరిపోదు. మరి నీ గుణగణాలు ఈ జన్మంతా వర్ణిస్తున్నా కొంత మిగిలే ఉంటుం దనుకుంటాను ...' చక్రవర్తి మాటలకు దెబ్బ తిన్నట్టు చూశాడు నాగరాజు. 'నీ నోటితో చెప్పినవి నీవే స్వయంగా వినాలనుకుంటే నాకేం అభ్యంతరం లేదు.' చక్రవర్తి లేచి వెళ్ళి సోఫా వెనకాల ఆన్ చేసి ఉన్న టేప్ రికార్డర్ పట్టుకొచ్చాడు. రివైండ్ చేసి వినిపిస్తుంటే నేను, నాగరాజు కూడా బిగిసి పోయాము.

'మిస్టర్ నాగరాజూ! నీ నీచమైన బ్రతుకు నేను విమలని పెళ్ళాడక ముందే తెలుసు. అందుకే అప్పుడు ఆమె నుండి ఏం వినాలనుకోలేదు. ఐనా ఆమె గతంతో నాకు పనిలేదు. ఆమెను కావాలనుకునే కోరి పెళ్ళాడాను. ఇప్పుడు ఇందులో రికార్డు చేసిన దంతా నీ నేరాల్ని నీ నోటితో నీవే ఒప్పుకున్నావు. నిన్ను పోలీసులకుపట్టివ్వడానికే ఇంత నాటకమాడాను. మొన్న నువ్వు రావడం తెలుసు. ఈ రోజు వస్తావనీ తెలుసు. ఇంక నిన్ను ఎవ్వరూ రక్షించలేరు'. చక్రవర్తి ఇంకా ఏదేదో మాట్లాడుతుండగానే నాగరాజు ఒక్క ఉదుటున లేచి, చక్రవర్తి దగ్గరున్న పాకెట్ సైజు టేప్ రికార్డర్ చేత జిక్కించుకుని బైటికి పరుగెత్త బోయాడు.

బైటి నుంచి షడన్‌గా వీధితలుపులు రెండూ మూసుకుపోయినాయి. బోనులో చిక్కిన పులిలాగా గాభరాగా తిరిగేస్తూ, హుంకరిస్తూ చక్రవర్తి మీదికి రాబోయాడు నాగరాజు. ఇద్దరూ కలియ బడ్డారు. ఇంతలో తలుపులు తెరుచుకుని చక్రవర్తి ఫ్రెండ్సిద్దరు లోని కొచ్చి నాగరాజు పెడరెక్కలు విరిచి కట్టారు. 'వీడికి తగిన శాస్తి పోలీసు స్టేషనులోనే జరగాలి. వీడ్ని అక్కడికి తీసు కెళ్తుంటాంగాని, నువ్వు ఆ టేప్ రికార్డు పట్టుకుని వెనకాల రా చక్రీ ...' అని చెప్పి వాళ్ళిద్దరూ నాగరాజును తీసుకెళ్ళిపోయారు.

ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తున్న నన్ను దగ్గరకు తీసుకున్నా రాయన. "చ చ ఇప్పుడేమైందని ఏడుస్తున్నావు? ఎవరెన్ని చెప్పినా, నిజంగా ఇంత క్రితం నీ వెంత పెద్ద పొరబాటు చేసినా నిన్ను వదులుకోను. నీ గత చరిత్ర అనవసరమని ఆనాడే చెప్పాను. అదంతా నాకు తెలుసునని తెలిస్తే నీ వెక్కడ చిన్నబుచ్చుకుంటావోనని చెప్పలేదు. ఇప్పుడు సమయం వచ్చింది గనుక బైట పడాల్సి వచ్చింది. మనకు పట్టిన శనిగ్రహం ఈ నాటితో వదిలి పోయింది. ఇంక మనకేం భయంలేదు. డోంట్ వర్రీ డియర్. ఇలాంటి చీడపురుగుని పట్టిచ్చినందుకు ప్రభుత్వానికి మన మెంతో సహాయం చేసినవాళ్ళ మైనాము. నేను వెళ్ళి గంటలో వచ్చేస్తాను. తలు పేసుకో ...' చెప్పి వెళ్ళా రాయన.

• • • •

"రాధీ ... విన్నావా ... సినిమాల్లో చేరాలనే తపనవల్లగాని, మరే ప్రలోభం వల్లగాని ఆడపిల్ల ఒక్కసారి ఇల్లుదాటి నాగరాజు లాంటి నీచులకూడా వెళ్ళాక శ్లేష్మంలోపడ్డ ఈగలా అక్కడే కొట్టుకుపో తుండాలి తప్ప, వారి కెలాంటి మంచిదారీ కనబడదు. ఎక్కడో నూటికో, కోటికో ఒక్కరు మీ అంకుల్ లాంటి మహానుభావులు నాలాంటి అభాగినులకు చేయూత నిచ్చి పైకి తీసుకొస్తే తప్ప, ఎవరైనా సరే ప్రతి క్షణం చచ్చి బ్రతుకుతూ, ఆ నరకంలో మగ్గి పోవలసిందే ... ఆ భయంకరమైన బ్రతుకు పగవాళ్ళకు కూడా వద్దమ్మా ..." విమల చెప్పడం ఆపింది. వింటున్న రాధిక భయంతో బిగిసిపోయింది. ట్రాజెడీ సినిమా చూసినంత బెంగగా దిగులుగా ఉంది ఆ పిల్లకు. జీవితంలో ప్రేమ, పెళ్ళి అంటే పూల బాట అనుకుంది. సినిమాల్లో చేరడం అంటే అదో రంగుల స్వప్న ప్రపంచం అనుకుంది గాని, ఆ బాటలో ఇన్ని ముళ్ళ కంపలు, ఎత్తు పల్లాలు కత్తుల బోనులు ఉంటాయని కల్లో కూడా వూహించలేదు. ఆ పిల్లలో అంతవరకు ఉన్న గుండె నిబ్బరం జారిపోయింది. ఉసూరుమంటూ నిట్టూర్చింది. "సరేలే అంటీ, ఈ రాత్రికి నేను వెళ్ళను. రేపు అతన్ని నీ దగ్గరకు తీసుకొస్తాను. నీవే అన్నీ మాట్లాడి మా పెళ్ళి జరిపించు. కింద కాలింగ్‌బెల్ మోగుతూంది. అంకుల్ వచ్చారేమో వెళ్దాంపద .." ఇద్దరూ లేచి కిందికొచ్చారు.

విమల తలుపులు తెరిచింది. ఎదురుగా భర్త చక్రవర్తి చేతిలో పేపరుతో నిలబడున్నాడు. "ఎవరూ రాధీ... నువ్విక్కడే ఉన్నావామ్మా. నిన్ను పిలిచి చెబుదామనే ఈ లోకల్ పేపర్ తెచ్చాను. ఇదిగో ఇలా చూడు విమలా! ఈ స్కౌండ్రల్ ఎవడో అమాయకపు ఆడపిల్లల్ని పెళ్ళాడతానని సినిమాల్లో చేరుస్తాను అంటూ నమ్మించి తీసుకెళ్ళి వ్యభిచార గృహాలకు అమ్మేస్తున్నాడట. ఇంతవరకు శ్రీకాకుళం, వైజాగ్ జిల్లాల్లో చాలా మంది ఆడ పిల్లల్ని మోసగించి తీసుకుపోయాడట. అందరూ పదిహేను పదహారువయస్సులోపు పిల్లలే. ప్రస్తుతం రెండు మూడు నెలలుగా మన ప్రాంతాల్లో తిరుగుతున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారట. మన వూళ్ళోనే నెల క్రితం ఇద్దరాడపిల్లల్ని మాయం చేశాడట. ఇదిగో వీడి ఫోటో కూడా వేశారు. అమ్మా రాధీ ... నువ్వు స్కూలు కెళ్ళేటప్పుడు వచ్చేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి తల్లీ. ఎవరు పిల్చినా ఎటూ వెళ్ళకేం ..." ఆయన ఇంకా ఏదో చెబుతూనే ఉన్నారు ...

ఒక్క ఉదుటున వెళ్ళి ఆయన చేతిలో పేపరు లాక్కుని చూసింది. అంతే ... యాసిడ్ పోసినట్లు వికృతంగా మారిపోయింది రాధిక ముఖం. ★

